# జన్మకో శివరాత్రి

-ఐతా చంద్రయ్య

ఆదివారం హాయిగా గడపడం ఎలా?

బుర్ర బుట్టలో రంగు రంగుల ప్రణాళికలు రెక్కలు విప్పినట్టే విప్పి ముడుచుకుంటున్నాయి.

ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు. ఇద్దరాడ పిల్లలు అక్షరాలా ఆడపిల్లలయ్యారు. ఒక్కగానొక్క అబ్బాయి ఉద్యోగ పర్వములో..మరో ఊళ్లో. ఎవరి సంసార సాగరం లోతుల్ని వాళ్లు కొలుస్తున్నారు. లంకంత కొంపలో లింగులిటుకుమంటూ ఇద్దరమే మిగిలాం.

''సర్కారు నౌకరీమీద సవాలక్ష ఊళ్లు తిరిగాం. పిల్లల భవిష్యత్తుకంటూ పైసా పైసా కూడ బెట్టి పెళ్లిళ్లకూ, కాన్పులకూ ఖర్చు చేశాం. ఇప్పుడు సొంతూళ్లో సొంతింట్లో ఉంటున్నా ఏం లాభం? ఓ సరదానా? చచ్చుబండలా?'' చెవిలో ఇల్లు గట్టుకుని కారాలు మిరియాలు నూరుతున్న ఇంటి ఇల్లాలు సుశీల సొద నా గుర్తింపులోకి రాక పోవడానికి బలమైన కారణముంది సుమా!

ప్రతి ఆదివారము ఏ సాహితీ సభలోనో, సంఘ కార్యక్రమాల్లోనో ప్రసంగం వెలగబెట్టేందుకు సూర్యుని కంటే ముందే లేచి వెళ్లడం, సూర్యుడు అస్తమించాక గూటికి చేరడం నా కలవాటైంది. ఈ రోజు మాత్రం ఖాళీగా ఉంది. అదే కొరకరాని కొయ్యలాంటి సవాలైకూచుంది. ఆలోచనాలోచనా లింకా తెరుచుకునే ఉన్నాయి.

''మన పెళ్లైముప్పయ్యేళ్లైంది. మరో మూడేళ్లలో రిటైరు కాబోతున్నారు. ఎన్నడన్నా సరదాగా మార్నింగ్ సినిమాకు తీసుకెళ్లారా?'' టీ కప్పు అందిస్తూ చురక అంటించింది సుశీల.

హమ్మయ్యా! ఒక్క దెబ్బకు రెండు పిట్టలు.

''ఎన్నడో ఎందుకోయ్! ఈరోజే ఇప్పుడే ఝూమ్మని మార్నింగ్ షో సిన్మాకెల్తున్నాం నడూ. వచ్చేప్పుడు స్టార్ హోటల్లో భోజనం పదా!'' ప్రకటన జారీ చేశా. సుశీల మొహం గుమ్మడి పూవులా విప్పారింది.

''నిజంగానా?'' పదిహేనేళ్ళ పడుచులా గెంతి, నా భుజమ్మీద చెయ్యేసింది. కళ్లను కమ్మగా తిప్పేసింది. నుదుటి అనుభవ రేఖల మధ్య పావలాకాసంతటి కుంకుమ బొట్టు రూపాయి బిళ్లలా నవ్వింది. ఆనాటి రెండు బారల జడ నేటి మూడు వరుసల కొప్పుగా మారినా ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదు.

''నిజమే! తొందరగా తెమలాలి మరి!'' బుగ్గలు నిమిరాను. అడ్వాన్స్ కాబోతుంటే ఆపేసి పక్కకు జరిగింది.

''ఆహా! జన్మకో శివరాత్రిలాగుందండీ!'' లేడి పిల్లలా లోపలికి తుర్రుమంది.

అరెరే! నా వ్యాపకాల్లో పడి అర్ధాంగి నక్రశ్రద్ధ చేస్తున్నానా? ముల్లులా గుచ్చుకుంది.

ఒకరినొకరికొకరి మందించుకుంటూ కొబ్బరి చట్నీతో ఇడ్లెన్లు తింటూంటే అరకులోయలో విహరిస్తూ, ఆవుపాల కోవా ఆరగిస్తున్నట్టుంది.

''చెల్లెమ్మా! వాడున్నాడా?'' ఉరుముతూ ప్రత్యక్షమయ్యాడు ప్రాణస్నేహితుడు కనపర్తి. దమ్ము దీస్తున్నాడు. గుండెలెగిరి పడ్తున్నట్టుంది.

''అదేమిత్రా? అరఫర్లాంగు దూరంలో ఇల్లుంటే అంత స్పీడుగా పరుగెత్తుకు రావాలా? ఏం కొంపలంటుకుపోయాయనీ?'' అంటూ సైగ చేశాను కూచోమ్మని.

''ముందిది తీసుకోండన్నయ్యా!'' టీ కప్పు అందించబోయింది సుశీల.

''టైం లేదమ్మా. త్రివేణి ఎటెట్లో చేస్తుంది. మీవదిన గాబరాపడి పోతుంది. మీరిద్దరూ ఉన్న పళాన బయల్దేరండి.'' దివాళా ఎత్తిన వ్యాపారిలా చేతులు పిసుక్కుంటున్నాడు. కుర్చీలో ముడుచుక్కూచున్నాడలాగే.

సుందరమైన భావాలకు అందమైన భాషను జోడించి కమ్మని కవిత్వం చెబుతాడు. కానీ వెధవకు మహా పిరికి. తన నీడకు తానే భయపడ్తాడు. త్రివేణి వాడి కోడలు. నా కొలీగ్ రాజారాం కూతురు కనపర్తి కొడుకూ, రాజారం కూతురు ప్రేమపక్షులుగా ఎగిరొచ్చి వాళ్లనో గూటికి పంపే బాధ్యత నా మీదుంచారు. కనపర్తిని బెదిరించి, రాజారాంను అదరగొట్టి మూడుముళ్ల కార్యక్రమం చేయించాల్సి వచ్చింది.

''అయ్యోపాపం! త్రివేణి నిండు చూలాలు. ఏమైందో ఏమో పదండి వెల్దాం. '' అంటూ సాగదీసింది సుశీల.

బంగెనపల్లి మామిడి పానకములో బందనకల్లు పుడకలా..ప్చ..ఉన్నొక్కరోజు..! బయలుదేరక తప్ప లేదు.

తెల్లనివీ, నల్లనివీ అన్నీ పాలేనని నమ్మే కనపర్తి పాతికేళ్లు పశువైద్యశాలలో ఉద్యోగం వెలగబెట్టి సాధించిన ఒకే ఒక ఘనకార్యం-అబద్ధపు అనారోగ్యముతో తాను రిటైరై ఆ ఉద్యోగం తన పెద్దకొడుక్కిప్పించడం. అదే పెద్ద కొడుకు ఉద్యోగసాధన విజయవంతమవగానే ముడుపుగట్టిన ప్రేమ మూటను విప్పి మూడో పురుషార్థ సాధనకే త్రివేణి మెడలో మూడు ముళ్లేశాడు. మూడు నెలల్లో గర్భవతిని చేసి అమ్మా నాన్నల పర్యవేక్షణలో ఉంచేశాడు. వారం వారం వచ్చేవాడే కాని, ముప్పైరోజులు ట్రెయినింగ్ కోసం మూడ్రోజుల క్రితమే ముంబై ట్రయినెక్కాడు. చిన్న కొడుకు విద్యార్థి.

ఇహపోతే కనపర్తి వియ్యంకుడు అదే నా కొలీగ్ మహారాజశ్రీ రాజరాం గారు తన వాదనా పటిమతో తిమ్మిని బమ్మి చెయ్యగల- ఏ.టి.పి. అంటే- ఆడ పిల్లల తండ్రి.

సర్వీసులో నా కంటే జూనియరైనా చాకచక్య ప్రదర్శనలో చాలా సీనియర్. తలకొరివి పెట్టే తనయుని కోసం ఎదురు చూస్తుంటే గంగ, యమున, సరస్వతులు వరుసగా పుట్టుకొచ్చారు. చివరి ఛాన్స్ త్రివేణి. ఎలాగూ ప్రేమించుకున్నారు గదాని పైసా కట్నం లేకుండా కన్నకూతుర్ని కనపర్తి కోడలుగా

**తెల్లనివీ, నల్లనివీ అన్నీ పాలేనని నమ్మే కనపర్తి పాతికేళ్లు పశువైద్యశాలలో ఉద్యోగం వెలగబెట్టి సాధించిన ఒకే ఒక ఘనకార్యం-అబద్ధపు అనారోగ్యముతో తాను రిటైరై ఆ ఉద్యోగం తన పెద్దకొడుక్కిప్పించడం. అదే పెద్ద కొడుకు ఉద్యోగసాధన విజయవంతమవగానే ముడుపుగట్టిన ప్రేమ మూటను విప్పి మూడో పురుషార్థ సాధనకే త్రివేణి మెడలో మూడు ముళ్లేశాడు.**




పంపించి చేతులు దులుపుకున్న ఘటనా ఘటన దురంధరుడు.

కనపర్తి ఇల్లు వనపర్తి అంగడిలాగుంది. రాజారాం దంపతులక్కడే ఉన్నారు. కాస్సేపు తర్జనభర్జన లయాక..పురిటి నొప్పులని తేల్చారు ఆడవాళ్ల. అఘమేఘాల మీద నాలుగు ఆటోల్లో కనపర్తి కాంపు, కామధేను, నర్సింగ్ హోంకు మారింది. ఇంటి వద్ద మెలికలు తిరిగిపోయిన చూలాలు ఆస్పత్రి మంచమ్మీద హాయిగా సేద దీర్చుకుంటుంది.

ప్రైవేట్ ఆస్పత్రి కాబట్టి నీట్‌గా, పసందుగా ఉంది. కాని ఏం లాభం? వచ్చిపోయే పేషెంట్ల బంధువులతో వరంగల్ బస్టాండులాగైంది. మహిళామణులు మంచం పక్క నుంటే మగమహారాజులం వరండా పాలిష్‌బండల నునుపుదనాన్ని పరిశీలిస్తున్నాం.

ఆటోవాళ్ల డబ్బులడుగుతున్నారు. కనపర్తి చూపులు రాజారాం వైపు మళ్లాయి- భావగర్భితంగా. నొప్పించక, తానొవ్వక, తప్పించుక తిరుగువాడు ధన్యుడనే సంగతి తటాలున గుర్తుకొచ్చిందేమో.

''అరెరే! లేడీ డాక్టరింకా రాలేదే! నేవెళ్లి తీసుకొస్తా'' నంటూ చల్లగా జారుకున్నాడు రాజారాం.

కనపర్తి జేబులో విశ్రాంతి తీసుకుంటున్న నాలుగు ఇరవై నోట్లకు రెక్కలొచ్చి ఆటోవాలాల చేతుల్లో వాలాయి.

ఇటు రాజారాం లేడీ డాక్టరుతో వస్తూంటే అటు త్రివేణికి మళ్లీ నొప్పులు ప్రారంభం. ఆస్పత్రి దద్దరిల్లిపోతుంది.

''అంత గట్టిగా అరిస్తే మా హాస్పిటల్ టాప్ ఎగిరిపోద్దమ్మా!'' లాంటి జోకులు కట్ చేస్తూ లేడీ డాక్టర్ ఏవేవో పరీక్షలు చేసింది. ఐదు నిమిషాల్లో ఆవిడ వాలకం ఫుల్లూరు బండ జాతరలో పూనకం రాబోతున్న శివసత్తి లాగైంది.

''ఇది మొదటి కాన్పా?'' అడిగింది గంభీరంగా. త్రివేణి తల్లి మలేరియా రోగిలా వణికిపోతూ పక్కకు తప్పుకుంది.

''ఔనమ్మా! మొదటి కాన్పే'' అందుకుంది సుశీల.

''పేషంట్ మీ కూతురా, కోడలా?'' మామూలు మూడ్‌లో కొస్తూ అంది డాక్టర్.

''పేషంట్ కీవిడ తల్లి, ఆవిడ అత్త.''

''ప్చ్! నెల తప్పగానే డాక్టర్‌కు చూపించలేదా?'' నవ్వుమొహాని కొచ్చింది. త్రివేణి తల్లి తల నేలకు వంగిపోయింది.

''ఐదో నెల్లో మేము చూపించి మందు లిప్పించామండీ!'' శ్రీమతి కనపర్తి చెప్పేసింది.

''అవెమ్మా..హవెమ్మా..అవమ్మవమ్మా..వమ్మా!'' నొప్పులకు తట్టుకోలేకపోతుంది త్రివేణి. కన్నతల్లి మొహం కలెగూర గంపలాగైంది. పేషెంటును లేబ్‌రూం లోకి పంపించి

''మందులైపోయిం తర్వాత మళ్లీ చూపించ లేదా?'' నిలదీసింది డాక్టర్. శ్రీమతి కనపర్తి గూడా ఆందోళనగా సుశీలవైపు చూచింది.

''అవెన్నీ ఇప్పుడెందుగ్గానీ..'' సముదాయించింది సుశీల.

''సర్సరే అర్థమైపోయింది..''అంటూ లేబర్ రూంలో కెళ్లింది.

మళ్లీ మగాళ్లం బయట వరండా బెంచీ కతుక్కుపోయాం. పనిలో పనిగా ప్రపంచ రాజకీయాలు చర్చిస్తున్నాం. ఆడవాళ్లొక్కొక్కరే లోపలి కెళ్లి వచ్చి చెవులు కొరుక్కుంటున్నారు.

రెండు గంటలు గడిచాయలా.

లేడీ . డాక్టర్ పరుగులాంటి నడకతో బయటికొచ్చింది మేమంతా చుట్టూ మూగాం.

''అమ్మాయి తల్లిదండ్రులెవరూ?''

రాజారం దంపతులు ముందు కొచ్చారు.

''కాన్పు కష్టమైపోయింది. వెంటనే పెద్దాపరేషన్ చెయ్యాలి. లేకపోతేప్రమాదం.''

''అయ్యోనా తల్లీ!'' గొల్లుమంది తల్లి.

దైవదర్శనానికి బయలుదేరి దారి తప్పి, దయ్యాలదిబ్బ చేరుకున్నట్టు కంగారుగా మొహాలు చూచుకున్నారు కనపర్తి దంపతులు.

''ఐతే వెంటనే చెయ్యండి డాక్టర్'' రాజారాం గొంతులో గుర గుర.

''నా కోడల్ని కాపాడండి డాక్టర్'' డాక్టరమ్మ

చేతులు పట్టుకుంది శ్రీమతి కనపర్తి.

"సరే...ఆపరేషన్‌కో మూడు వేలు, మందులు వగైరాలకో రెండు...ఓ ఐదు వేల రూపాయలు ముందు అడ్వాన్స్ కట్టండి."

ఆముదం తాగిన అవిటివాడిలాగైపోయాడు కనపర్తి. "అంటే...అడ్వాన్స్ కట్టే దాకా..."

"ఆపరేషన్ జరగదు. త్వరగా ఆలోచించుకుని చెప్పండి." బొంగరంలా వెనుదిరిగింది డాక్టర్. ఆ ఊపుకు జడలోని రెండు మల్లెపూలు నేలరాలి నవ్వుకుంటున్నాయి.

"బావగారూ!" అదిరి పడ్డట్టుంది కనపర్తి "ఆ అడ్వాన్సేదో వెంటనే కట్టెయ్యండి."

"నేనా!" ఉలిక్కిపడ్డాడు రాజారాం. "ఐదు వేలా? ఆర్ ది స్పాటా?" నోరు గుండుసున్నలా తెరుచుకుంది.

"ఔను. మీ కూతురేగదా! లేకపోతే ప్రమాద మట!"

రాజారాం మొహంలో రంగులు మారుతున్నాయి. వాలకం గంభీరమైంది.

"నా డొక్క చీల్చి డోలు వాయించినా దమ్మిడీ లేదు."

లేబర్ రూం లోంచి వచ్చిన శ్రీమతి రాజారాం కళ్ళ నీళ్ళు, కృష్ణా, గోదావరిలా ప్రవహిస్తున్నాయి.

"అయ్యో! మనమ్మాయి..మనమ్మాయండీ!" కొంగుతో కళ్ళద్దుకుంది. రాజాలాగున్న రాజారాం బేజారయాడు.

"ప్లీజ్ బావగారూ!" కనపర్తి చేతులందుకున్నాడు.


"పుట్టబోయేది మీ వంశాంకురమే గదా! వెంటనే ఆటోలో ఇంటికెళ్ళి పట్టుకురండి."

చేతులు వెనక్కి లాక్కుని "పైగా ఇదొకటేనా?" అంటూ మూడు మూరల వెనక్కి జరిగాడతడు.

వచ్చీపోయే వాళ్ళు మా వైపు వింతగా చూస్తున్నారు.

"అదేంటన్నయ్యా?" శ్రీమతి కనపర్తి కనుబొమ్మ లెగిరి పడినై. చెవుల రాళ్ళ కమ్మలు చెమక్కుమన్నాయి. "మొదటి కాన్పు మీరే చేయించి తల్లీ బిడ్డను క్షేమంగా మా ఇంటికి చేర్చడం మీ బాధ్యత. ఇది అనాదిగా వస్తున్న సాంప్రదాయం. అమ్మాయిని కాన్పుకు తీసుకెళ్లాలనే ఇంగితజ్ఞానం లేదు. పైగా ఆస్పత్రి ఖర్చులు మామీదే రుద్దాలనా?" దుమదుమ లాడింది.

రాజారాం దంపతులు మొహాలు చూచుకోవడం తప్ప మాతులు కదపడం లేదు.




"అయ్యో! వీళ్లిట్లా మీన మేషాలు లెక్కిస్తుంటే అమ్మాయేమై పోవాలండీ?" సుశీల ఆందోళన.

"దయచేసి అడ్వాన్స్ కట్టెయ్యండమ్మా. తర్వాత లెక్కలు చూచుకుందాం." వియ్యపురాలిని మొదటిసారిగా బతిమాలాడు రాజారాం.

"ఐతే...ఇదీ ఓ రకమైన బ్లాక్ మెయిలింగన్న మాట!" కనపర్తి పళ్ళు పటపట లాడాయి.

అబ్బో! వీడిగ్గాడా రోషముందే!

"సార్సార్!" నా వైపు తిరిగాడు రాజారాం.

"దయచేసి మీరన్నా చెప్పండి. నా...కూ..తు..రు..ప్రాణాలు" గొంతు పూడుకు పోతుంది. కళ్లు మంచుపూలైనాయి.

..మాటల పుంజు చేష్టలుడిగి పోతుందే!

"చెప్పరా బాబూ; నువ్వే చెప్పు" కలహమంటే కాళ్లూ చేతులు పిసుక్కునే కనపర్తి కలికావతార మెత్తాడు. "అన్నింటికీ మేము నోరు మూసుక్కూచుంటున్నాం కాబట్టి అలుసైపోయాం. కన్న కూతురు కాన్పు కుందని తెలీదా పెద్దమనిషికి?"

"రాజారాం! అమ్మాయిని మొదటి కాన్పు కెందుకు తీసుకెళ్లలేదూ?" నిలదీశారు.

ఈ సంగతి తేలితేగాని ఆపరేషను కడ్వాన్సు వచ్చేలా లేదు.

అతని ముఖారవిందము కందగడ్డ లాగైంది. చేతి గుడ్డతో కళ్లద్దుకున్నాడు.

"అదీ...అది..ఈ రోజు అమావాస్య గదా! రేపు తీసుకెల్దామనుకున్నాను సార్!"

"నెలలు నిండక ముందే తీసుకెళ్తే బాగుండేది వదినా! ఆడవాళ్లం మనమన్నా చెప్పాలిగదా!" శ్రీమతి రాజారాంను మందలించింది సుశీల.

ఆవిడ కనురెప్పలు పైకి లేచాయి. చూపులు నావైపు మళ్లాయి.

"మావారి సంగతి మీకు తెలుసుగదన్నయ్యా!" అన్నట్టుగున్నాయా చూపులు.

"ఒరేయ్ కనపర్తీ! ముందు నువ్వు డబ్బు తెచ్చి కట్టెయ్. తర్వాత ఆలోచిద్దాం." పురమాయించాను.

"అయ్యోదేవుడా! నా దగ్గరున్నదేదో బాంకు ఎకౌంట్‌లో ఉంది. ఈరోజు ఆదివారం గదా!"

త్రివేణి కేకలు మాదాకా వస్తున్నాయి.

అమ్మాయి అల్లాడిపోతుంటే వీళ్లు దెబ్బలాడుకుంటున్నారే! అనుకోని దేమన్నా జరిగిపోతే? నా గుండె గుడగుడలాడింది.

"డబ్బు కట్టేశారా? డ్యాక్టరమ్మ కనుక్కురమ్మన్నారండీ!" నర్సు వయ్యారంగా వచ్చి అడిగింది.

న్యాయమూర్తి ముందు దోషుల్లా వియ్యంకుల చూపులు నేల కతుక్కుపోయాయి.

ఇహ లాభం లేదు. మాటకారి రాజారాం పిసినారితనం, కదలిక లేని కనపర్తి భయం...అమ్మాయి ప్రాణాలతో చెలగాటం. అనుమానం, ఆందోళనలు, నా నరాల్లో కోకో ఆడుకుంటున్నాయి.

"నేను తెస్తానుండండి." బయలుదేర బోయాను.

"కంగ్రాట్స్‌సార్!" మరో నర్సు మారథన్ పరుగుతో వచ్చింది.

"త్రివేణి ప్రసవించింది. ఆడపిల్లసార్! తల్లీ పిల్ల క్షేమం సార్! నేనే అటెండయాను సార్!" అని బుద్ధిగా నుంచుంది. ట్రాజడీకి తెర పడింది.

ఆశ్చర్యంతో మా మొహం చేటల యాయి.

"ఆహా! ఆదివారం. అమావాస్య లక్ష్మీదేవి మీ ఇంటికి నడిచొచ్చింది. అదృష్టమంటే మీదే బావా!" రాజారాం సంబరపడిపోతూ కనపర్తి జేబులోంచి ఇరవైనోటు లాగి వార్త తెచ్చిన నర్సు చేతుల్లో వుంచాడు. ★



## తగ్గిన జోరు

రవళి అనే పదం ఈమధ్య వార్తల్లో చాలావరకు రవళించడం మానేసింది. 'పెళ్లిసందడి'లో రమ్యకృష్ణ చాన్స్‌నే కొట్టేసి మనిషి, అమూల్య సంస్థల్లో హిట్స్ అందించిన ఈ భామకు ఇప్పుడు పూర్తి చేయాల్సిన చిత్రాలు ఒకటీ, రెండు తప్ప పెద్దగా లేవు. అప్పట్లో అక్క హరితను కూడా తెలుగులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు అక్కకే కాదు, తనకే చాన్స్‌లు లేకపోవడంతో దిగాలుపడిపోయిందట. 'ఇలా ఎందుకు జరిగింది?' అని శ్రేయోభిలాషులు ప్రశ్నిస్తే 'రవళి లావైంది' అని కొందరు పనికట్టుకుని ప్రచారం చేశారు అంటూ వాపోయిందిట. లావైన విషయం తనకి తెలియదు కాబోలు. అంతే లెండి!

-జె.వి.బాబు